సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 3 । అక్టోబర్ । 2024



దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు


దసరా సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు హైదరాబాద్ నుంచి తరలివచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను సిద్ధం చేశారు. -8లో



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కందరాజు శాన్విక్ శివ వర్మ (పాలకోడేరుకు) రూ.లక్ష విరాళం అందించారు.

3.08 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 3,08,168 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

చంద్రబాబు, పవన్ క్షమాపణలు చెప్పాలి

అమలాపురం టౌన్: తిరుపతి లడ్డూ పవిత్రతపై అనుచిత వ్యాఖ్యలు చేసి, కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు అమలాపురంలో బుధవారం ప్రకటన విడుదల చేశారు. తగిన విచారణ, సాంకేతిక పరీక్ష జరగకుండానే లడ్డూ కల్తీ జరిగిందని ప్రకటనలు చేయడం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి తగదన్నారు. ఆ ఆరోపణలు, ప్రకటనలు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తాయని సర్వోన్నత న్యాయ స్థానం వ్యాఖ్యానించడమే దీనికి నిదర్శనమన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి



అమలాపురంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న వలంటీర్లు

అమలాపురం టౌన్: నాలుగు నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామంటూ వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. గతంలో మాదిరిగానే తమను విధుల్లో కొనసాగించేలా చూడాలని అభ్యర్థించారు. పెండింగ్ గౌరవ వేతనాలు అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్ల జిల్లా సంఘం చైర్మన్ కె.సత్తిబాబు, కన్వీనర్ ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్

రాయవరం: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నిర్ణీత షెడ్యూల్‌లో గురువారం నుంచి ఈ నెల 21 వరకూ ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తారు. అమలాపురం భట్లపాలెంలోని బీవీసీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 3,221 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. హాల్ టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ముందస్తుగా చేరుకోవాలి. పరీక్షా సమయానికి గంటన్నర ముందు వారిని కేంద్రంలోకి అనుమతిస్తారు. అభ్యర్థులు తమ వెంట గుర్తింపు కార్డులు తీసుకువెళ్లాలి. పరీక్షలు రాసే అభ్యర్థులకు ఏమైనా సందేహాలు తలెత్తితే పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్ 70131 50811, 99494 94659, 94942 31139, 81254 27611 నంబర్లకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చునని ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ డైరెక్టరు ఎస్.సురేష్ తెలిపారు.

స్వచ్ఛతాహి సేవ విజయవంతం



సత్కరిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్: గాంధీజీ స్ఫూర్తితో చేపట్టిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం విజయవంతమైందని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం గాంధీ జయంతి, స్వచ్ఛతాహి సేవ 2024 ముగింపు సమావేశం జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ చాలా కాలం క్రితమే పరిసరాల పరిశుభ్రతపై ప్రజా ఉద్యమానికి గాంధీజీ పిలుపు ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని అమలు పరిచారన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని, వాటి స్థానంలో జూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. డీపీఓ రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో పారిశుధ్యంపై సామాజిక స్పృహను పెంపొందించడం జరిగిందన్నారు. అనంతరం మండలానికి ఒకరు చొప్పున 22 మంది సర్పంచులు, 22 మంది సఫాయి మిత్రలు, 22 మంది పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక దుమారం

- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇసుక కొరత
- నిలిచిన భవన నిర్మాణాలు
- పనిలేక కార్మికుల అవస్థలు
- గోదావరి నదీపాయల్లో వరద నీరు
- మరో నెల రోజులు ఇదే పరిస్థితి



రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు తమ గోడు వినిపిస్తున్న తాపీమేస్త్రులు, కార్మిక సంఘం నాయకులు

సాక్షి, అమలాపురం: "ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రంలో ఇసుక దొరకడం లేదు. దొరికినా ధర ఇష్టానుసారం పెంచేస్తున్నారు. దీని వల్ల రాష్ట్రంలో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా పోతోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కావాల్సినంత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం'' – ఇవీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు వచ్చిన ప్రతి సందర్భంలోనూ నాటి ప్రతిపక్ష నేత హోదాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు. కానీ సీన్ కట్ చేస్తే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటింది. గత ప్రభుత్వం ముందు జాగ్రత్తగా నిల్వ చేసిన ఇసుకను ఖాళీ చేయడం మినహా ఒక్క యూనిట్ ఇసుకను సైతం గోదావరి నుంచి గానీ, ఇతర ప్రాంతాల నుంచి సేకరించింది లేదు. దీనితో జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణాలతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఈ కారణంగా వేల మంది తాపీమేస్త్రులు, కూలీలకు పనులు లేకుండా పోయాయి.

స్టాక్ పాయింట్లు ఖాళీ

జిల్లాలో ఆరు స్టాక్ పాయింట్లలో ఇసుకను నిల్వ చేశారు. రావులపాలెంలో రెండు, కొత్తపేట (మండపల్లి), జొన్నాడ, కపిలేశ్వరపురం, తాతపూడి స్టాక్ పాయింట్లలో సుమారు 2,44,131 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నాయని అధికారులు తెలిపారు. ఇక్కడ ఆగస్టు 10 నాటికే ఇసుక అయిపోయింది. నాటి నుంచి ఇసుక దొరకడం గగనమైంది. గత ప్రభుత్వం వరదల సమయంలో అవసరాలకు అనుగుణంగా స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే స్థానిక నాయకులు దొడ్డిదారిన ఎగుమతి చేసి సొమ్ములు చేసుకున్న విషయం తెలిసిందే.

ట్యాక్స్ పేరుతో దోపిడీ

ఉచిత ఇసుక అమలులోకి వచ్చిన తరువాత 'జే', 'బీ' ట్యాక్స్ పేరుతో దోచుకున్నారు. ఈ ట్యాక్సులు, లారీల యజమానుల అదనపు వసూళ్లతో ఉచిత ఇసుక కాస్తా వినియోగదారులకు మోయలేని భారంగా మారింది. ఇసుక లేకపోవడంతో అక్రమంగా నిల్వ చేసిన వారు చెలరేగిపోతున్నారు. ఎంతంగా అంటే రావులపాలెంలో ఐదు యూనిట్ల ఇసుక రూ.25 వేల వరకూ ధర పలికిందంటే డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మిగిలిన చోట్ల ఇది కాస్తా రూ.30 వేల వరకు ధర పలుకుతోంది. దీనితో చాలా మంది నిర్మాణ పనులు నిలిపివేశారు. చివరకు ప్రభుత్వం చేపట్టిన సీసీ రోడ్లు, భవన నిర్మాణాలకు సైతం ఇసుక దొరకడం లేదు.

ముందు చూపు లేక..

కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత గోదావరిలో ర్యాంపుల నుంచి ఇసుక తీసేందుకు 40 రోజులు సమయం ఉన్నా ఆ వైపు దృష్టి సారించలేదు. ప్రభుత్వం జూన్ 12న కొలువుదీరగా, గోదావరికి జూలై 20న వరదలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సమయంలో ర్యాంపుల నుంచి ఇసుక సేకరించి ఉంటే ప్రస్తుతం ఇంత ఇసుక కొరతను ఎదుర్కొనాల్సిన దుస్థితి వచ్చేది కాదు. ఈ సమయంలో కనీసం మూడు, నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను సేకరించి స్టాక్ పాయింట్లలో నిల్వ చేసే అవకాశం ఉండేది.

ర్యాంపులు తెరిచేదెప్పుడో..

గోదావరిలో జూలై 20 నుంచి వరద మొదలైంది. ఈ ఏడాది ఏకంగా మూడుసార్లు వరద పోటు తగిలింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో 2,88,317 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. సాధారణంగా అక్టోబరులో రెండో వారంలో గోదావరిలో నీటి లభ్యత చాలా తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో రోజుకు 30 వేలు మించి నీరు విడుదల కాదు. ఈ అంచనాతోనే అక్టోబరు 15 నాటికి ర్యాంపులు అందుబాటులోకి వస్తాయని మైనింగ్ అధికారులు అంచనా వేశారు. కానీ పరిస్థితి చూస్తుంటే నవంబరు 2వ వారం తరువాత కాని ర్యాంపులు తెరిచే అవకాశం లేదని చెబుతున్నారు.

నిలిచిన నిర్మాణాలు

ఇసుక దొరకపోవడంతో నిర్మాణ రంగం దాదాపు స్తంభించింది. ఈ కారణంగా తాపీ మేస్త్రులకు, వారి సహాయకులుగా నిలిచే కూలీలకు, శ్లాబ్‌లు వేసే బంటా కూలీలకు పనిలేకుండా పోయింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు సుమారు 2.45 లక్షల మంది ఉంటారని అంచనా. ఒక్క కోనసీమ జిల్లాలోనే సుమారు 90 వేల మంది వరకు ఉంటారు. వీరిలో 80 శాతం మందికీ రోజూ పని దొరకడం లేదు. మరో నెల రోజులు ఇదే పరిస్థితి కొనసాగనుంది. దీనితో వారంతా పూట గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణాలు ఆగిపోవడంతో వీరితో పాటు ఆ రంగానికి అనుసంధానంగా ఉండే టైల్స్ పనివాళ్లు, కార్పెంటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఇతర నిర్మాణాలు చేసే కార్మికులకు సైతం పనులు తగ్గిపోయాయి. ఇసుక లేక పనులు నిలిచిపోవడంతో అప్పులపాలై దిక్కుతోచని స్థితిలో ఉన్నామని గత శుక్రవారం మలికిపురం, సఖినేటిపల్లి మండలాల తాపీమేస్త్రుల సంఘం సభ్యులు రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. వీరితోపాటు పెయింటర్లు, ఎలక్ట్రికల్ వర్కర్లు, ట్రాక్టర్లు, ట్రక్ ఆటో యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.

పనుల్లేక ఇబ్బందులు



ఇసుక దొరకక మాతో పాటు, ఇతర భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయి. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇసుక దొరికే వరకు భవన నిర్మాణాలు మొదలు కావు. అప్పటి వరకూ మాకు కష్టాలు తప్పవు.

– బోనం చిన్నా, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల తాపీమేస్త్రుల సంఘం అధ్యక్షుడు

ఇసుక దొరకడం లేదు



ఇసుక దొరకడం లేదు. మాకు నెల రోజులుగా పనులు లేవు. నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తాపీమేస్త్రులతో పాటు టైల్స్ పనివాళ్లు, ఇతర కూలీల పరిస్థితి కూడా ఇలాగే. మరో నెల ఇదే పరిస్థితి కొనసాగుతుందని చెబుతున్నారు.

– తోట సత్తిబాబు, తాపీమేస్త్రి, మండపేట



అమలాపురంలో నిలిచిన అపార్ట్‌మెంట్ నిర్మాణం



రావులపాలెంలో ఆగిపోయిన భవనం

మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకం



కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జేసీ నిషాంతి తదితరులు

అమలాపురం రూరల్: మహాత్మాగాంధీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని జాతిపిత విగ్రహానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గుజరాత్‌లోని పోరుబందర్‌లో ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన గాంధీ.. అహింస అనే ఆయుధంతో ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టి మహాత్ముడయ్యారన్నారు. ఆ మహనీయుని త్యాగఫలితమే మనం ఈనాడు అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అన్నారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు గాంధీ జయంతి రోజును 2007వ నుంచి అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన మద్యం పాలసీ రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: ప్రభుత్వం నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని, మద్యాన్ని, మత్తు పదార్థాలను నిషేధించాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఐద్వా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. గాంధీ విగ్రహం సాక్షిగా మద్యం సీసాలను పగలగొట్టారు. యువత భవితను, మహిళల జీవితాలను నాశనం చేస్తున్న మద్యానికి లక్ష్యాలు నిర్దేశించి విక్రయించడం సిగ్గుచేటు అని జిల్లా ఐద్వా అధ్యక్షురాలు ఎండీ హమీద్ ఉన్నీసా ధ్వజమెత్తారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రధాన అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టకుండా మద్యం ద్వారా ఆదాయం పొందటానికి చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి, ప్రతినిధులు పాల్గొన్నారు.

మన్నించు మహాత్మా..



గొల్లపాలెంలో చికెన్ కొనేందుకు వేచి ఉన్న ప్రజలు

కాజులూరు: జాతిపిత మహాత్మాగాంధీ జయంత్యుత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ జయంతి సందర్భంగా మాంసం విక్రయాలపై దేశ వ్యాప్తంగా నిషేధం ఉంది. కానీ ఆ నిబంధనను మాంసం వ్యాపారులు పట్టించుకోలేదు. కాజులూరు మండలంలో మాంసం అమ్మకాలు యథేచ్ఛగా జరిగాయి. ఈవోపీఆర్‌డీ కొండలరావు ఆదేశాల మేరకు సచివాలయ కార్యదర్శులు మండలంలో చేపలు, మాంసం విక్రయదారులకు మంగళవారమే నోటీసులు జారీ చేశారు. కానీ గొల్లపాలెం తదితర గ్రామాలలో చికెన్, మటన్ వ్యాపారులు అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ అమ్మకాలు కొనసాగించారు. వీటి ఫొటోలను కొందరు యువకులు వాట్సాప్ గ్రూపులలో పోస్టింగ్ చేయడంతో అధికారులు అప్రమత్తమై, పోలీసుల సహకారంతో దుకాణాలను మూయించివేశారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల పోరుబాట



అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో సత్యాగ్రహ దీక్ష చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: రాష్ట్రంలోని మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ పోరుబాటు పట్టిందని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా జరుగుతున్న పోరాటంలో భాగంగా అమలాపురంలో యూటీఎఫ్ ఉపాధ్యాయులు బుధవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకూ యూటీఎఫ్ ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీజీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలైన జీపీఎఫ్, అప్‌గ్రేడేషన్, ప్రమోషన్, బదిలీలను పరిష్కరించడంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు ఎలాంటి సౌకర్యాలు వర్తింపచేస్తుందో, వాటినన్నింటినీ మున్సిపల్ ఉపాధ్యాయులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1800కి పైగా ఉపాధ్యాయ పోస్టులను అప్‌గ్రేడేషన్ చేయాల్సి ఉందని గుర్తు చేశారు. యూటీఎఫ్ మున్సిపల్ సబ్ కమిటీ సభ్యుడు రాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్బన్ ఎంఈవో పోస్టులన్నీ అర్హత కలిగిన మున్సిపల్ ప్రధానోపాధ్యాయులతో మాత్రమే భర్తీ చేయాలని స్పష్టం చేశారు. చివరగా మహాత్మా గాంధీ విగ్రహానికి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. జిల్లాలోని పలు మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గామాత.. నమోస్తుతే

- నేటి నుంచి దసరా ఉత్సవాలు
- కూడళ్లలో చలువ పందిళ్లు సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు



అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిరి ముఖద్వారం

అమలాపురం టౌన్: దసరా శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని ప్రముఖ ఆలయాలు, ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు సిద్ధం చేశారు. వాటిలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించనున్నారు. గురువారం నుంచి 12వ తేదీ వరకూ అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరగనున్నాయి. దసరా సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పెద్ద ఎత్తున భక్తులు భవానీ మాలలు ధరించి పూజలు నిర్వహిస్తున్నారు. మారుమూల గ్రామాలలో సైతం అమ్మవారి పూజలతో సందడి నెలకొంది.

జిల్లాలో 950 ఆలయాలు

జిల్లాలో కనకదుర్గమ్మ ఆలయాలు సుమారు 950 వరకూ ఉన్నాయి. వాటి వద్ద ఇప్పటికే చలువ పందిళ్లు వెలిశాయి. కొన్ని ప్రధాన ఆలయాల వద్ద సినిమా సెట్టింగ్‌ల మాదిరిగా సిద్ధం చేశారు. ఆలయాలను మామిడి తోరణాలు, పూల దండలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. విజయ దశమి తొమ్మిది రోజులూ అమ్మవారి రోజుకో అలంకరణతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయాల వద్ద నిత్య హోమాలు, కుంకుమ పూజలు, అన్నసమారాధనలు నిర్వహించనున్నారు.

అంగరంగ వైభవంగా..

దసరా ఉత్సవాలకు పేరుగాంచిన అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. సినిమా సెట్టింగ్‌లను తలపించేలా రూ.లక్షల వ్యయంతో చలువ పందిరిని ముస్తాబు చేశారు. తొమ్మిది రోజులూ ఆలయం వద్ద పలు రకాల హోమాలు నిర్వహిస్తారు. సాంఘిక, పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. ఈ నెల 16న అమలాపురం శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 250 మంది కళాకారులతో 18 రకాల సాంస్కృతిక ప్రదర్శనలతో భారీ ఊరేగింపు ఏర్పాటు చేశారు.

- అమలాపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కూడా దశమి ఉత్సవాలు భారీ ఎత్తున జరుగుతాయి. దాదాపు రూ.3 కోట్ల కరెన్సీ నోట్లతో వాసవీ మాతను మహాలక్ష్మిగా అలంకరించేందుకు పట్టణ ఆర్య వైశ్య సంఘం సన్నాహాలు చేస్తోంది.
- అమలాపురంలో చెడీ తాలింఖానా ఉత్సవాలు, ఊరేగింపులను నిర్వహించే ఏడు వీధులు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కూడా ఆయా వీధుల దేవతా మూర్తుల వాహనాల వద్ద దశమి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి.
- పి.గన్నవరం నియోజకవర్గంలోని మామిడికుదురు మండలం పాశర్లపూడి, పెదపట్నంలంక గ్రామాల్లో, పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం అమ్మవారి ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేశారు.
- ముమ్మిడివరం నియోజకవర్గంలోని తానేలంక, కాట్రేనికోన, కొమరగిరి మెరక, తాళ్లరేవు, సుంకరపాలెం, ముమ్మిడివరంలోని అమ్మవారి ఆలయాల వద్ద దసరా ఉత్సవాల జరగనున్నాయి.
- రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దసరా ఉత్సవాల సంబరాలు అంబరాన్ని అంటేలా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రామచంద్రపురం పట్టణంలోని శివాలయం రోడ్డు, కొత్తూరి రోడ్డులో గల అమ్మవారి ఆలయాల వద్ద కూడా భారీగా జరుగుతాయి.
- కొత్తపేటలోని బొరుసు వారి సావరం అమ్మవారి ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు ఆలమూరు మార్కెట్, చెముడులంక గ్రామాల్లో భారీ ఎత్తున నిర్వహిస్తారు. = మండపేట పట్టణంలోని కలువపువ్వు సెంటర్, నాయుళ్ల గుడి, కొండపల్లి సెంటర్‌లో దశమి ఉత్సవాలు భారీగా జరుగుతాయి.
- రాజోలు నియోజకవర్గంలోని అమ్మవార్ల ఆలయాల వద్ద శరన్నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు జరిగాయి.



చలువ పందిరిలో ఆకట్టుకుంటున్న అలంకరణ

చదువులమ్మకు సొంతగూడు


పి.వెంకటాపురంలో నిర్మించిన పీఎం కేంద్రీయ విద్యాలయ నూతన భవనం


పాఠశాల ప్రాంగణంలో సమావేశాల కోసం ఏర్పాటు చేసిన వేదిక

- కేంద్రీయ విద్యాలయకు నూతన భవనం
- పి.వెంకటాపురంలో సర్వహంగులతో సిద్ధం
- ఇరుకు గదులకు స్వస్తి
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మాణం

కాకినాడ రూరల్: ఇరుగు గదులు.. చాలీచాలనీ భవనాలు.. అంతంత మాత్రంగా ఉండే సదుపాయాలతో నెట్టుకొచ్చిన కాకినాడ కేంద్రీయ విద్యాలయకు మంచి రోజులు వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా వలసపాకల గ్రామంలోని కాకినాడ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయకు నూతన భవనం సమకూరింది. కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం గ్రామంలో సుమారు ఐదు ఎకరాల విశాలమైన స్థలంలో కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.28.43 కోట్లతో పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ పేరిట నూతన భవనాలు నిర్మాణం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2022 నవంబర్‌లో ప్రారంభించారు. ప్రధాని మోదీ దృష్టికి కేంద్రీయ విద్యాలయ దుస్థితిని తీసుకువెళ్లి నిధులు రాబట్టడంలో అప్పటి ఎంపీ వంగా గీత సఫలీకృతమయ్యారు. పట్టుదలతో ఆమె చేసిన కృషికి ఫలితంగా భావి పౌరులను తీర్చిదిద్దే సరస్వతి నిలయం నేడు అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ ఒకటి నుంచి పది వరకూ తరగతులు నిర్వహించేందుకు వీలుగా భవనాలు నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో కూడిన భవనాలలో మొత్తం 47 గదులు ఉన్నాయి. వీటిలో 24 గదులను తరగతులుగా వినియోగించనున్నారు. అలాగే సభలు, కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదిక, పాఠశాల ఆవరణలోని రూ.4.05 కోట్ల బాస్కెట్ బాల్, వాలీబాల్ మైదానాల నిర్మాణం చేపడుతున్నారు.


నూతన భవన ప్రాంగణంలో విద్యార్థుల సందడి

జూలై నుంచి నూతన భవనంలో తరగతులు

వలసపాకలలో ఇరుకైన గదుల్లో పడుతున్న ఇబ్బందులకు స్వస్తి పలికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూలై నుంచి పి.వెంకటాపురంలోని కొత్త భవనంలోకి పాఠశాలను తరలించారు. దీంతో నూతన భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ప్లే గ్రౌండ్ పనులు పూర్తయితే పీఎం కేంద్రీయ విద్యాలయ నూతన భవనం పూర్తిగా అందుబాటులోకి వస్తుంది. నేషనల్ ప్రాజెక్ట్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌పీసీసీ) ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. అక్టోబర్ నెలాఖరుకు పనులు పూర్తవుతాయని ఏఈ ఈశ్వరరావు తెలిపారు.

కొత్త భవనంతో విద్యార్థులకు ఊపిరి

గతంలో వలసపాకలలో విద్యార్థులు ఊపిరి ఆగినంత పని అయ్యింది. ఇరుగు గదుల్లో గాలి ఆడక సుమారు 30 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అప్పట్లో పరిశ్రమల నుంచి వచ్చిన విష వాయువుల ప్రభావం ఉంటుందని ప్రచారం జరిగింది. ఇరుగు గదుల్లో విష వాయువు కారణంగానే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అప్పట్లో నిర్ధారణ చేశారు. ఇప్పుడు వలసపాకల నుంచి పాఠశాలను తరలించడంతో విద్యార్థులకు ఊపిరి వచ్చినట్టు అయ్యింది. విశాలమైన గదుల్లో చదువులు సాగనున్నాయి. ప్రస్తుతం 405 మంది విద్యార్థులు కేంద్రీయ విద్యాలయలో చదువుతున్నారు.

ప్రశాంత వాతావరణం



కొత్త భవనంలో తరగతి గదులు బాగున్నాయి. ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు అవకాశం కలిగింది. అయితే కాకినాడకు దూరంగా ఉండడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది.

– రిషిత జాస్తికా, 9వ తరగతి

తరగతుల నిర్వహణ

వలసపాకల కాకినాడ పబ్లిక్ స్కూల్ ఆవరణలోని కేంద్రీయ విద్యాలయను పి.వెంకటాపురానికి తరలించారు. నూతన భవనం పూర్తిగా మాకు అప్పగించలేదు. తరగతి గదులు గల భవనాలు పూర్తవడంతో తరగతులు ఇక్కడే నిర్వహిస్తున్నాం. పీఎం మోదీ చేతులు మీదుగా త్వరలో పీఎం కేంద్రీయ విద్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం ఉంటుంది.

– బొంతు శేఖర్, ప్రిన్సిపాల్, కేంద్రీయ విద్యాలయ.

క్లుప్తంగా

పుష్కర కాలువలో విద్యార్థి గల్లంతు!


పుష్కర కాలువలో గాలిస్తున్న స్థానికులు


సతీష్ (ఫైల్)

పిఠాపురం: బహిర్భూమికి వెళ్లిన విద్యార్థి ప్రమాదవశాత్తూ పుష్కర కాలువలో పడి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లప్రోలు మండలం కొడవలికి చెందిన ఉప్పనబోయిన సతీష్ బుధవారం ఆ గ్రామ సమీపంలోని పుష్కర కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. రోజూ మాదిరిగానే వెళ్లిన బాలుడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. కాలువలో పడిపోయి ఉండాడని భావించి గొల్లప్రోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై నౌడు రామకృష్ణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. అయితే బుధవారం సాయంత్రం వరకూ కాలువలో ఎంత గాలించినా సతీష్ ఆచూకీ దొరకలేదు. దీంతో గురువారం ఉదయం నుంచి మళ్లీ గాలిస్తామని ఎస్సై తెలిపారు. సతీష్ తాటిపర్తి హైస్కూలులో 10వ తరగతి చదువుతున్నారు. బాలుడు గల్లంతవ్వడంతో తండ్రి వీర వెంకట సత్యనారాయణ, తల్లి శిరీష, అక్క శ్రీదేవి గుండెలవిసేలా రోదిస్తున్నారు.

7,200 లీటర్ల డీజిల్ స్వాధీనం


కోరంగి పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 7200 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని, మూడు వాహనాలను అధికారులు సీజ్ చేశారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎస్ఓ లక్ష్మీ ప్రసన్న, వీఆర్వోలతో కలిసి కోరంగి పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 7200 లీటర్ల డీజిల్‌ను తరలిస్తున్న మూడు వాహనాలను గుర్తించారు. యానాంలోని పెట్రోల్ బంకుల నుంచి డీజిల్‌ను కొనుగోలు చేసి కాకినాడకు తరలించి, ఇక్కడి బోట్లు, ఆక్వా చెరువులకు విక్రయిస్తున్నారు. యానాంలో లీటర్ డీజిల్‌ను 84.79కు కొనుగోలు చేసి మన రాష్ట్రంలో రూ.97కి అమ్ముతున్నారు. ఆ వాహనాలతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

లారీ డ్రైవర్ మృతి

తొండంగి: ముందు వెళుతున్న లారీ సడన్‌గా ఆగడంతో దాన్ని వెనుక నుంచి ఢీకొన్న మరో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐరన్ లోడుతో విశాఖపట్నం నుంచి విజయవాడ వైపునకు లారీ వెళుతోంది. తొండంగి మండలం బెండపూడి శివారు జాతీయ రహదారిపై అన్నవరం నమూనా టెంపుల్ సమీపంలోకి వచ్చేటప్పటికీ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో వెనకాలే విశాఖపట్నం నుంచి పాలకొల్లు వెళుతున్న కంటెనర్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆ లారీ కేబిన్‌లోని డ్రైవర్ బలుసు వెంకటరమణ (30) తీవ్రంగా గాయపడ్డాడు. కేబిన్‌లో చిక్కుకున్న అతడిని పోలీసులు, హైవే సిబ్బంది బయటకు తీసి తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ అక్కడ చికిత్స పొందుతూ రమణ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెయ్యి కోట్ల కుంకుమార్చనలే లక్ష్యం

- రానున్న పదేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు
- శ్రీపీఠంలో నేటి నుంచి దసరా ఉత్సవాలు
- విలేకరులతో పరిపూర్ణానందస్వామి



కాకినాడ రూరల్: శ్రీపీఠంలో ఈ దసరా నుంచి రానున్న పదేళ్లలో వెయ్యికోట్ల కుంకుమార్చనలు నిర్వహించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు పరిపూర్ణానంద స్వామి వెల్లడించారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని శ్రీపీఠంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాశక్తి యాగం పేరిట గురువారం నుంచి దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గత ఏడాది కార్తిక మాసంలో 30 రోజుల పాటు వంద కోట్ల మంది మహిళలతో కుంకుమార్చన నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమవ్వడంతో దసరా ఉత్సవాల్లో కుంకుమార్చనలకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ పూజల కోసం ఇప్పటికే 54 వేల రిజిస్ట్రేషన్లు అయ్యాయని, రోజూ కనీసం 35 వేల నుంచి 40 వేల మంది మహిళలు హాజరవుతారని భావించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం పది గంటలకు కుంకుమార్చన ప్రారంభమవుతుందని, భక్తులు 9 గంటలకు హాజరవ్వాలన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా 9వ తేదీన మూలా నక్షత్రం సందర్భంగా 24 వేల మంది విద్యార్థులతో సరస్వతీ పూజ జరిపిస్తామన్నారు. 10న దుర్గాష్టమి రోజున 64 వేల మంది భక్తులు ఒకే రకమైన వస్త్రధారణతో కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. నవమి రోజు దాత సమకూర్చనున్న 15 వేల తులసి మొక్కలతో పూజలు చేసి 9 రోజులు పూజలో పాల్గొన్న వారికి అందజేస్తామన్నారు.

విక్రయానికి తల్లి ఒప్పుకోలేదనే శిశువు హత్య

- ఆడపిల్లను చంపిన తండ్రి అరెస్టు
- రిమాండ్‌కు తరలింపు


కేసు వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు

కాకినాడ క్రైం: ఆడపిల్ల పుట్టిందనే కోపంతో రగిలిపోతున్న అతడు ఆ శిశువుకు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. దానికి తల్లి ఒప్పుకోకపోవడంతో 34 రోజుల బిడ్డను దారుణంగా చంపేశాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ వన్ టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. జగన్నాథపురం పప్పుల మిల్లు సమీపంలో నివసిస్తున్న కేతా శివమణి తనకు ఆడపిల్ల పుట్టిందని కోపంతో ఉండేవాడు. చివరకు ఆ పాపను అమ్మేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని మంగళవారం శిశువు తల్లి అయిన తాను సహజీవనం చేస్తున్న చెక్కా భవానీతో చెప్పాడు. ఆమె దానికి ఒప్పుకోకపోవడంతో ఆగ్రహంతో ఊగిపోయాడు. పాపను చంపాలని నిర్ణయించుకుని తొలుత గొంతునులిమాడు. కొనప్రాణాలతో కొట్టుమిట్టాడున్న శిశువును గోడకేసి కొట్టి పరారయ్యాడు. వెంటనే తల్లి స్థానికుల సాయంతో పాపను ఆసుపత్రికి తరలించగా శిశువు మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కాగా.. పరారీలో ఉన్న శివమణిని ప్రత్యేక బృందాలు డాగ్ స్క్వాడ్ సాయంతో గాలించి పట్టుకున్నాయి. అతడిని బుధవారం ఉదయం అరెస్టు చేసి కాకినాడ మూడో ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు రిమాండ్ కోసం తరలించామన్నారు. గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్న సీఐ నాగదుర్గారావు, ఆయన బృందాన్ని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

రూ.5.86 లక్షల విలువైన ఆయిల్ సీజ్


పాశర్లపూడిలంకలో విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన ఆయిల్ పీపాలు

మామిడికుదురు: అక్రమంగా నిల్వ ఉంచిన సాల్వెంట్ ఆయిల్‌ను విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. ఈ సందర్భంగా పాశర్లపూడిలంకకు చెందిన రాచకొండ వెంకటేశ్వరరావు అలియాస్ ఆయిల్ శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 47 పీపాల్లో నిల్వ చేసిన రూ.5.86 లక్షల విలువైన 9,400 లీటర్ల సాల్వెంట్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎంఎస్ఓ దేవళ్ల శ్రీనివాస్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. తీగ లాగితే డొంక కదిలిన తరహాలో ఈ వ్యవహారం వెలుగు చూసింది. రావులపాలెంలో ఒక కేసు విచారణ సందర్భంగా ఆయిల్ శ్రీను వ్యవహారం వెలుగు చూసింది. సఖినేటిపల్లి మండలం పల్లిపాలెం వద్ద నిందితుడికి ఉన్న బయో డీజిల్ బంకుకు చెందిన బిల్లు రావులపాలెం కేసులో బయటపడింది. దాని ఆధారంగా మంగళవారం విజిలెన్స్, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. గురువారం ఉదయం వరకు ఏకదాటిగా చేసిన విచారణలో అక్రమంగా నిల్వ ఉంచిన ఆయిల్ వ్యవహారం వెలుగుచూసింది. 55 ఖాళీ పీపాలను కూడా స్వాధీనం చేసుకుని, పాశర్లపూడి పెట్రోల్ బంకు యజమానికి అప్పగించారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై ఎ.చైతన్య కుమార్ తెలిపారు.

అధికారుల పర్యవేక్షణ లేకే నగదు గల్లంతు

సీతానగరం: అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారింది. వెదుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రైతులకు సంబంధించిన రుణ చెల్లింపులు, షేర్ క్యాపిటల్ రూ.56 లక్షలు గల్లంతైన విషయం తెలిసిందే. వెదుళ్లపల్లి పీఏసీఎస్‌పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు నెలల క్రితం నగదు గల్లంతైందని వెలుగులోకి వచ్చినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఆ సొమ్మును రికవరీ చేయలేకపోయారు. దీనికి ముందు సంఘంలో సేల్స్‌మన్‌ను ఏర్పాటు చేసి ఎరువుల అమ్మకాలు జరిపారు. వాటిలో సుమారు రూ.7 లక్షలు గోల్‌మాల్ జరిగినట్టు గుర్తించిన అధికారులు సంఘంలో ఆ నగదు జమ చేయాలని నామమాత్రంగా చెప్పి వదిలేశారు. ఎరువుల నగదు గల్లంతైందని గుర్తించిన నెల రోజులకు పీఏసీఎస్ రికార్డుల తనిఖీలో రూ.56 లక్షలు మాయమైనట్టు వెలుగులోకి వచ్చింది. ఈ సొమ్ములు కట్టాలని సంఘం సీఈవో సురేంద్రకు ఆదేశించి రెండు నెలలైనా అతడు పట్టించుకోలేదు. అలాగే కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పీఏసీఎస్‌లో ఏడాది క్రితం రూ 2.కోట్ల కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో గుమస్తా ఉద్యోగం ఇచ్చారు. గత నెల కోరుకొండ మండలం బుచ్చింపేటలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఆ శిబిరంలో సంఘం సీఈవో సురేంద్ర ఉన్నట్లు సమాచారం. ఎరువుల నగదు గల్లంతైన సమయంలోనే అధికారులు కఠినంగా వ్యవహరించి ఉంటే ఇప్పుడు ఇన్ని లక్షల పోయేవి కాదని రైతులు చెబుతున్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- 8వ తేదీ నుంచి జిల్లాకు 37 ప్రత్యేక బస్సులు
- దసరా అనంతరం 75 స్పెషల్ సర్వీసులు


దసరా ప్రయాణికుల కోసం సిద్ధంగా ఉన్న ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రాజమహేంద్రవరం సిటీ: దసరా సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు హైదరాబాద్ నుంచి తరలివచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను సిద్ధం చేశారు. ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ హైదరాబాద్ నుంచి జిల్లాలోని గోకవరం, కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం డిపోలకు వచ్చే ప్రయాణికుల కోసం 37 సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేశారు. వీటితో పాటు విశాఖపట్నం విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్టు అధికారులు ప్రకటించారు.

దసరా తరువాత 75 ప్రత్యేక బస్సులు

దసరా పండగ అనంతరం జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఇతర ప్రాంతాలకు తరలివెళ్లే ప్రయాణీకుల సౌకర్యార్థం 75 ప్రత్యేక బస్సులను సిద్ధం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.

సాధారణ చార్జీలతో ప్రత్యేక సర్వీసులు

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు కాక ముందు వరకు ఏపీఎస్ ఆర్టీసీ పండగలు, ఇతర ప్రత్యేక సర్వీసుల్లో ప్రయాణించేవారికి అధిక చార్జీలు వసూలు చేసేది. ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు కూడా పరిస్థితులను బట్టి రెండింతలు, ఇంకా ఎక్కువ మొత్తంలో వసూలు చేసి నిలువు దోపిడీ చేసేవారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజల ఇబ్బందులు గుర్తిస్తూ సాధారణ చార్జీతోనే స్పెషల్ సర్వీసుల్లో ప్రయాణించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలిగింది. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన ఈ విధానాన్ని ఆర్టీసీ అధికారులు నేటికీ అమలు చేస్తున్నారు.

గత ఏడాది (2023–24) దసరా ప్రత్యేక బస్సులు

- దసరా సందర్భంగా గతేడాది దసరా ముందుగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఖమ్మం ప్రాంతాల నుంచి 82 ప్రత్యేక బస్సులను నడిపారు. దీని ద్వారా 44,943 కిలోమీటర్లు బస్సులు నడపగా 5,097 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. వీరిద్వారా రూ.17,74,661 ఆదాయాన్ని సాధించారు.
- దసరా తరువాత జిల్లాలోని నాలుగు డిపోల నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఖమ్మం, శ్రీశైలం, యానాం ప్రాంతాలకు 105 ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా రూ.26,68,317 ఆదాయాన్ని సాధించారు. దీని ద్వారా 53,107 కిలోమీటర్లు ద్వారా 8790 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.

ప్రజలు స్పెషల్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి



దసరా పండగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం విశేష ఏర్పాట్లు చేశాం. హైదరాబాద్ నుంచి జిల్లా తరలివచ్చే ప్రయాణికుల కోసం జిల్లాలోని నాలుగు డిపోలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. దసరా అనంతరం తిరుగు ప్రయాణానికి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రత్యేక బస్సులను నడుపుతాం.

– షర్మిల అశోక, ఆర్టీసీ డీపీటీఓ, రాజమహేంద్రవరం

చోరీ కేసులో ఇద్దరు యువకుల అరెస్టు


నిందితులు, వారి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులతో సీఐ విద్యాసాగర్

కొత్తపేట: చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. కొత్తపేట బ్యాంకు కాలనీలో నివాసముంటున్న రామోజు అనురాధ, తన కుటుంబ సభ్యులతో ఈ ఏడాది మే 5వ తేదీ సాయంత్రం రాజమహేంద్రవరంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి 9వ తేదీ ఉదయం ఇంటికి రాగా తలుపు బద్దలు కొట్టి తెరిచి ఉంది. ఇంట్లోకి వెళ్లి బీరువాలో పరిశీలించగా దానిలో భద్రపరిచిన బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. ఎస్పీ బి.కృష్ణారావు పర్యవేక్షణలో డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై జి.సురేంద్ర దర్యాప్తు జరిపారు. ఈ సందర్భంగా కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన బండారు మణికంఠ, చింతపల్లి వెంకటరాజు అనే యువకులను అరెస్టు చేశారు. వారి నుంచి 212 గ్రాముల బంగారం వస్తువులు, 2 కేజీల వెండి వస్తువులు, వాచీ స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ఈ కేసును చేధించిన డీఎస్పీ వై.గోవిందరావు, సీఐ విద్యాసాగర్, సీసీఎస్ సీఐ డి.ప్రశాంత్, ఎస్సై జి.సురేంద్ర, సీసీఎస్ ఏఎస్సై ఏ.బాలకృష్ణ, హెచ్‌సీలు డీఎస్ స్వామి, ఎం.వీర్రాజు, పీసీలను ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

వైఎస్సార్ సీపీ సర్పంచ్‌పై జనసేన నాయకుల దాడి


కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సూర్యారావుపేట సర్పంచ్ సూరాడ చిన్ని

కాకినాడ రూరల్: మహాత్మా గాంధీ జయంతి రోజు మత్స్యకార గ్రామమైన సూర్యారావుపేటలో వైఎస్సార్ సీపీకి చెందిన మహిళా సర్పంచ్‌పై దాడి జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆధిపత్య ధోరణిని ప్రదర్శిస్తున్న జనసేన పార్టీకి చెందిన ఆ గ్రామ నాయకులు ఈ ఘటనకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. పంచాయతీలోని డంపింగ్ యార్డు వద్ద గాంధీ జయంతి నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. అయితే గాంధీ విగ్రహానికి ప్రొటోకాల్‌కు విరుద్ధంగా కొందరు జనసేన నాయకులు దండలు వేయబోయారు. దీంతో అక్కడే ఉన్న వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్ చిన్ని, ఆమె భర్త రాజు ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నాన్ని ప్రశ్నించారు. దీంతో ప్రొటోకాల్ ప్రకారం సర్పంచ్‌తో ఆయన దండ వేయించారు. అనంతరం మధ్యాహ్నం పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న సర్పంచ్‌పై జనసేన నాయకులు దాడికి పాల్పడి, బూతులు తిట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్ని, ఎంపీటీసీ రాజేశ్వరి వర్గీయుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తనపై రాజేశ్వరి తదితరులు దాడి చేయడంతో గాయాలతో ఆస్పత్రిలో చేరినట్టు సర్పంచ్ చిన్ని తెలిపారు. ఎంఎల్‌సీ అనంతరం తిమ్మాపురం పోలీసు స్టేషన్‌లో ఏడుగురిపై ఫిర్యాదు చేసినన్నారు. దీనిపై ఎస్సై రవీంద్రబాబును వివరణ కోరగా సర్పంచ్ చిన్ని ఫిర్యాదుపై రాజేశ్వరి తదితరులు ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఎంపీటీసీ రాజేశ్వరి ఫిర్యాదు మేరకు సర్పంచ్ తదితరులు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఇరు వర్గాలు ఘర్షణ పడినట్టు ఆయన తెలిపారు.

సామాజిక తనిఖీలో ఉద్యోగులపై వేటు

శంఖవరం: ఉద్యోగులపై వేటు వేయడానికే ప్రాధాన్యమిస్తూ ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభ జరిగింది. ఎంపీపీ పర్వత రాజుబాబు అధ్యక్షతన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సభ నిర్వహించారు. ఈ సభకు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ జరిగిన ఉపాధి పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ ఏడాదిలో రూ.9.66 లక్షల పనులు జరగ్గా రూ.6.44 లక్షలు వేతనాలకు, రూ.3.22 లక్షలు మెటీరియల్ రూపంలో ఖర్చు చేశారు. మండల వ్యాప్తంగా 14 పంచాయతీల్లో జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.1.62 వేలు రికవరీ గుర్తించినట్లు తెలిపారు. టీడీపీ నేతలు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేయడమే లక్ష్యంగా ఫిర్యాదులు చేశారు. కత్తిపూడి, మండపం ఫీల్డ్ అసిస్టెంట్లపై ఒత్తిడి చేసి, వారితో రాజీనామాలు చేయించారు. వారి ఫిర్యాదుపై నెల్లిపూడి, ఎస్.జగ్గంపేట ఫీల్డ్ అసిస్టెంట్లను పీడీ సస్పెండ్ చేశారు. దీంతో సామాజిక తనిఖీ సభ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడానికి నిర్వహించినట్టు అయ్యింది. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, ఎస్ఆర్పీ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.